శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● పంజాగుట్ట సబ్ డివిజన్ ఏసీపీ మోహన్ కుమార్



పంజాగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పంజాగుట్ట పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ ఎస్.మోహన్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు ఆయన వెల్లడించారు.

డివిజన్ పరిధిలో ఎన్ని ప్రార్థనా మందిరాలు ఉన్నాయి?

పంజాగుట్ట పీఎస్ పరిధిలో 61, మధురానగర్ పీఎస్ పరిధిలో 49 ఉన్నాయి. పంజాగుట్టలో 39 దేవాలయాలు, 11 మసీదులు, 4 చర్చిలు, 7 చిల్లాలు, మధురానగర్‌లో 20 దేవాలయాలు, 12 మసీదులు, 10 చర్చిలు, 1 గురుద్వార, 6 చిల్లాలు ఉన్నాయి.

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

విద్వేషాలు రెచ్చగొట్టే ఘటనల నేపథ్యంలో ప్రార్థనా మందిరాల వద్ద రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచాం. అర్ధ రాత్రి 12 నుంచి ఒంటి గంట మధ్య, తెల్లవారు జామున 4 నుంచి 5 గంటల మధ్య పెట్రో కార్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు, శాంతి, మైత్రి కమిటీ సభ్యులతో పండుగలప్పుడు సమావేశాలు పెడుతున్నాం



వీడీసీసీ రోడ్డు పనులను ప్రారంభించిన అనంతరం స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

● కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడంతో పాటు జాప్యం లేకుండా చూడాలని వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 5 సుఖ్‌దేవ్‌నగర్‌లో రూపాయలు 25 లక్షల నిధులతో వీడీసీసీ రోడ్డు పనులను ఆమె శుక్రవారం ప్రారంభించారు. అనంతరం స్థానికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా వీడీసీసీ పరిజ్ఞానంతో నాణ్యంగా ఉండే రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తయిన అన్నిచోట్ల రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేర్ ఆస్పత్రుల చైర్మన్ హరిప్రసాద్

ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్‌పై కేర్ ఆస్పత్రి అవగాహన

ఖైరతాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేటితరంలో ఆరోగ్య సంరక్షణలో ఇన్ఫెక్షన్ల నియంత్రణ చాలా కీలకమని కేర్ ఆస్పత్రుల గ్రూప్ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. నాంపల్లి కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 12వ నేషనల్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్(ఐపీసీ) రెండురోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో ఇన్ఫెక్షన్లను అరికట్టే విషయమై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ సమీ, ఐపీసీ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ముస్తఫా అఫ్జల్ మాట్లాడుతూ ఆరోగ్య నిపుణులకు రిస్కులను తప్పించి భద్రతతో కూడిన వాతావరణాన్ని కల్పించేందుకు ఐపీసీ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ప్రముఖులు రాజీవ్ చౌరే, డాక్టర్ వినీ అశోక్‌త్రిభువన్, డాక్టర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ నిర్వహిస్తున్న సీఈసీ అధికారులు

ఎన్నికల విధులపై అధికారుల ఆరా

ఖైరతాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విభాగాల్లో పనితీరును పరిశీలించేందుకు ముఖ్య ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ప్రత్యేక బృందం శుక్రవారం ఖైరతాబాద్‌కు వచ్చింది. ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్- 18 ఉపకమిషనర్ ప్రశాంతి, సహాయ ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బందిని పలు అంశాలపై ప్రశ్నించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసూనాంబ, డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ ప్రత్యేక అధికారులుగా వచ్చి బీఎల్‌వోలకు నియామక పత్రాలు, వెబ్‌సైట్లలో అధికారుల ఫోన్ నంబర్లు ఉంచడం, ప్రతివారం పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, ఓటరు జాబితాలో పేర్లను తొలగించేప్పుడు నోటీసులిచ్చే అంశంతోపాటు పలు విషయాలపై చర్చించారు.

రోడ్డుపైనే మురుగు పరుగు

● కొన్నేళ్లుగా బ్రాహ్మణవాడిలో మురుగు సమస్య
● పట్టించుకోని ప్రజాప్రతినిధులు
● రాకపోకలకు స్థానికుల ఇబ్బందులు



బ్రాహ్మణవాడి రహదారిలో ప్రవహిస్తున్న మురుగునీరు

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి ప్రాంతంలో కొన్నేళ్ల తీవ్రంగా మురుగు సమస్య నెలకొంది. కుందన్‌బాగ్‌కు చెందిన మురుగునీరు బేగంపేట రైల్వేస్టేషన్ పట్టాల కింద నుంచి బ్రాహ్మణవాడి రహదారిలోకి వస్తుంది. అయితే పట్టాల కింద ప్రహరీ నుంచి వచ్చే మురుగునీరు ప్రధాన రహదారిలో ప్రవహిస్తుంది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. దాంతో నిత్యం రహదారిలో పెద్ద ఎత్తున మురుగునీరు వరదలా ప్రవహిస్తున్నది. దిగువన ఉన్న పల్లపు ప్రాంతంలో మురుగు నీరు నిలుస్తున్నది. వర్షం కురిసిందంటే మురుగునీరుకు వరదనీరు కూడా తోడవడంతో ఈ దారిలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిలోనే విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు వెళ్తున్నారని మండిపడుతున్నారు. పదేళ్లుగా మురుగు సమస్యకు పరిష్కారం చూపడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమైయ్యారని బ్రాహ్మణవాడి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైల్వే గోడ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

● రెండు సెక్షన్ల పరిధిలో సమస్య

కుందన్‌బాగ్ ప్రాంతం సోమాజిగూడ వాటర్ వర్క్స్ పరిధిలోకి వస్తుంది. బ్రాహ్మణవాడి ప్రాంతం ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ పరిధిలో వస్తుంది. అంటే ఒక సోమాజిగూడ ప్రాంతానికి చెందిన వాటర్‌వర్క్స్ పరిధిలోని కుందన్‌బాగ్ నుంచి ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ పరిధిలోని బ్రాహ్మణవాడికి మురుగునీరు వస్తుంది. పలు మార్లు వాటర్‌వర్క్స్, స్థానిక అధికారులు వచ్చి సమస్యను చూస్తున్నారే తప్ప పరిష్కారం చేయడంలేదు. నెల రోజుల క్రితం వాటర్‌వర్క్స్ జీ.ఎం వినోద్ కార్పొరేటర్ మహేశ్వరి ఈ ప్రాంతంలో పర్యటించారు. కుందన్‌బాగ్ మురుగునీరు రైల్వే పట్టాల కిందగా ఎలా వస్తుందో అర్థం కావడం లేదని ఈ సదర్భంగా పేర్కొన్నారు. రెండు సెక్షన్ల అధికారులు కలిసి సమస్యపై అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని అప్పట్లో తెలిపారు. ఇలా గత పది సంవత్సరాలుగా పలువురు అధికారులు వచ్చి చూచి వెళుతున్నారే కాని మురుగు సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

త్వరలో సమస్యకు పరిష్కారం

కుందన్‌బాక్‌కు చెందిన మురుగునీరు రైల్వేలైను పట్టాల కింద ఉన్న జీహెచ్‌ఎంసి వర్షపునీటి నాలాలోకి వెళుతున్నాయి. అక్కడ నుంచి పట్టాల కిందుగా ప్రహరీ దాటి బ్రాహ్మణవాడిలోకి మురుగునీరు చేరుతుంది. శుక్రవారం డివిజన్-6కు చెందిన డీ.జీ.ఎం వంశీతో కలిసి రెండు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు సమస్య తెలిసింది. దీంతో కుందన్‌బాగ్ నుంచి వచ్చే మురుగునీరు పట్టాల కింద ఉన్న జీహెచ్‌ఎంసీ నాలాలో కలవడం వల్లనే... అది నిండి ఇటు వైపునకు వస్తున్నాయని అంచనాకు వచ్చాం. కుందన్‌బాగ్ నుంచి వచ్చే మురుగునీరు పట్టాల కింద ఉన్న జీహెచ్‌ఎంసీ నాలాలో కలవకుండా డైవర్ట్ చేయడం వల్ల సమస్య పరిష్కారం అవుతుందని ఇద్దరం భావించాం. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఒక వేళ డైవర్ట్ చేసినా మురుగునీరు ఇటు వైపు వస్తే ఏమి చేయాలనే విషయంపై అధ్యయనం చేస్తున్నాం. త్వరలో మురుగు సమస్యకు పరిష్కారం చూపిస్తాం

- ఆశీష్, వాటర్‌వర్క్స్ డీజీఎం



రైటప్: 6) ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరమణ

3కేజీల గంజాయి స్వాధీనం

● 44 ప్యాకెట్లతో పాటు, రెండు సెల్‌ఫోన్లు, తూకం యంత్రాలు స్వాధీనం

అమీర్‌పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గంజాయిని రహస్యంగా భద్రపరిచి అవసరమైన వారికి విక్రయిస్తున్న ఇద్దరితో పాటు మరో ఎనిమిది మందిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డితో కలిసి ఏసీపీ వెంకటరమణ వివరాలు వెల్లడించారు. బల్కంపేటలోని ఓ భవనం మూడవ అంతస్థులోని గదిలో గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎస్ఆర్‌నగర్ పోలీసులతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా దాడి చేశారు. 8 నెలల కిందట గదిని అద్దెకు తీసుకున్న ప్రకాశం జిల్లా కంభంకు చెందిన ఆరపాటి హరికృష్ణ(24), బల్కంపేటకు చెందిన జాబ బెంకట నవీన్‌కుమార్(26)లు గంజాయి వ్యాపారం మొదలుపెట్టారు. హరికృష్ణ మిత్రుడైన ఆంధ్రప్రదేశ్‌లోని తునికి చెందిన అశోక్ వద్ద వీరు గంజాయి కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చి 15 గ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.800 నుంచి రూ.1000కి విక్రయిస్తున్నారు. వీరి గదిపై దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 44 ప్యాకెట్లతో సహా 3కేజీల గంజాయిని, రెండు సెల్ ఫోన్లు, మరో రెండు తూకం యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద గంజాయి కొనుగోలు చేసిన మరో ఆరుగురిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజు రాథోడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సినీ పరిశ్రమలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నటుడు మోహన్‌బాబును కలిసి సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్, ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ

- బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

నిబంధనలు పాటించని స్పా సెంటర్‌పై కేసు

ఖైరతాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా సెలూన్‌తోపాటు స్పా సెంటర్ నడుపుతున్న నిర్వాహకులపై ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ చౌరస్తా సమీపంలోని ఆకాష్ గంగా అపార్టుమెంట్‌లో ఓ ఫ్లాట్‌లో పరమేశ్వర్ కొండబరావు అలియాస్ బాలాజీ అనే వ్యక్తి స్పా సెంటర్‌ను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు పోలీసులు సమాచారం అందింది. ఈ మేరకు అక్కడికెళ్లగా నిపుణులు లేకుండా స్పా సెంటర్ నడపడం, సరైన పార్టీషన్లు లేకపోవడం, వచ్చినవారి వివరాలు నమోదు చేయకపోవడంపై నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.



అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఆధ్వర్యంలో జరిగిన వైట్ కోట్ వేడుకలో పాల్గొన్న వైద్యులు

వైద్యులు రోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి

● అపోలో ఆస్పత్రి గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రూమా

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యులు రోగుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, రోగితో మాట్లాడేటప్పుడు శాంతంగా, ఆత్మవిశ్వాసంతో మెలగాలని, వారికిచ్చే సలహా ఉత్తమంగా ఉండాలని అపోలో ఆస్పత్రి గైనకాలజీ విభాగం గౌరవ ప్రొఫెసర్ డాక్టర్ రూమా సిన్హా తెలిపారు. వైద్య విద్యలో అడుగు పెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన వైట్ కోట్ వేడుక ను అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రూమా సిన్హా విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డాక్టర్ అయ్యేందుకు తెలివితేటలు, కష్టపడి పని చేయడం ముఖ్యమైన లక్షణాలన్నారు. రోగుల సమస్యను అర్థం చేసుకొని, దానికి పరిష్కారం కనుగొనాలన్నారు. రోగికి సరైన చికిత్స ఇస్తే వారికి వైద్యుడిపై నమ్మకం పెరుగుతుందన్నారు. డాక్టర్ సలహాతో మెరుగుపడితే, జీవితాంతం జ్ఞాపకం ఉంచుకుంటారన్నారు. డీన్ డాక్టర్ కె. మనోహర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థులు వైద్య వృత్తిలోకి అడుగు పెట్టే సందర్భం అన్నారు.

ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం



డా.బీ.ఆర్ అంబేడ్కర్ వర్సిటీలో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు, విద్యార్థులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డా.బీ.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జె.ఎన్.ఎ.ఎఫ్.ఎ.యూ) కేటాయించాలనే ప్రభుత్వ లేఖ ఉపసంహరించుకోవాలని వర్సిటీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. 64 రోజులుగా వర్సిటీలో జరుగుతున్న నిరసనను మరింత ఉధృతంగా చేయడానికి ఉద్యోగులు, విద్యార్థులు డిజిటల్ మీడియాను ఉపయోగించాలని జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబడే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం జూబ్లీహిల్స్ విశ్వవిద్యాలయంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పరిపాలన భవనం ముందు బైఠాయించి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వమిచ్చిన లేఖను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జేఏసీ రూపొందించిన వెబ్‌సైట్‌ను పరిశోధక విద్యార్థి ఎస్.కృష్ణయ్య ప్రారంభించారు. ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ నెల 21న విశ్వవిద్యాలయంలో నిర్వహించే 'వంటా వార్పు' కార్యక్రమానికి అందరు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో డా.ఎల్వీకే రెడ్డి, డా.వెంకటేశ్వర్లు, డా.యకేశ్ దైద, డా.ఉదయని, కాంతం ప్రేమ్‌కుమార్, డా.కిషోర్, డా. రాఘవేంద్ర, పాండు, రాములు, అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోషియేషన్, టైం స్కేల్ ఉద్యోగులు, ఉద్యోగ సవఘాల నేతలు పాల్గొన్నారు.

24 నుంచి స్వర్ణ దేవాలయ బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లో హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తున్న స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి (స్వర్ణ) ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి జరుగుతాయని మూవ్‌మెంట్ నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల గోడపత్రికను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్ర గౌరదాస మాట్లాడుతూ, 2018 నుంచి ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఆరు రోజుల పాటు ఆలయంలో మూలావర్ ఉత్సవ అభిషేకం, ఉంజల్‌సేవ, 108 కలశాలతో అభిషేకం వంటి పూజలతో పాటు రాధాకృష్ణుల మూల విరాట్ విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన మోహన్‌నాయుడు

● స్పెక్ట్రమ్ పబ్లిషర్స్ పుస్తకాలు అందజేత



ఏపీ సీఎం చంద్రబాబుకు స్పెక్ట్రమ్ పబ్లిషర్స్ పుస్తకాలు అందజేస్తున్న మోహన్‌నాయుడు

అమీర్‌పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును శుక్రవారం హైదరాబాద్ బల్కంపేటకు చెందిన సూర్నేని మోహన్‌నాయుడు అమరావతిలోని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిసి స్పెక్ట్రమ్ పబ్లిషర్స్ పుస్తకాలు అందజేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యాసంస్థల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు, టీడీపీ ఆర్థిక సౌజన్యంతో ఇంజనీరింగ్, ఇతర ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పార్టీ కార్యకర్తల పిల్లలకు స్పెక్ట్రమ్ పబ్లిషర్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాలు అందజేస్తున్నట్లు సంస్థ అధినేత సూర్నేని మోహన్‌నాయుడు వెల్లడించారు. ఈ సందర్భంగా బాబును కలిసిన మోహన్‌నాయుడు కార్యకర్తల పిల్లల విద్యాభివృద్ధికి తమ సంస్థ చేపట్టనున్న పుస్తక పంపిణీ గురించి వివరించారు. ఈ సందర్భంగా డిగ్రీ, ఇంజనీరింగ్‌కు సంబంధించిన సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల కోసం తమ సంస్థ ప్రచురించిన పుస్తకాలను చంద్రబాబుకు బహూకరించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడుతూ విపత్కర పరిస్థితులకు గురైన పార్టీ కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, వారికి మంచి భవిష్యత్తును అందించే విషయంలో పార్టీ రాజీపడపోదని పేర్కొన్నారు. స్పెక్ట్రమ్ లాంటి సంస్థలు ముందుకొచ్చి పుస్తక విస్తరణకు సుముఖత వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం చంద్రబాబుకు శ్రీవారి ప్రతిమను అందజేసి శ్వేతవస్త్రంతో మోహన్ నాయుడు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, రచయిత డాక్టర్ ఉదయకుమార్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 21న 2కే రన్

పంజాగుట్ట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబరు 21న నెక్లెస్ రోడ్‌లో నిర్వహించనున్న డ్రగ్స్ రహిత తెలంగాణ 2కె రన్ పోస్టరును ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆవిష్కరించారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఈ 2కే రన్ నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షులు పెండెం తారక్ గౌడ్, రవికుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు గణేష్ ,అశోక్,సాయినాథ్, శ్రీను, పరమేష్,రాజు మంత్రి ,సంజయ్ ముదిరాజ్, మహేందర్,మారుతీ, సంతోష్ నాయుడు పాల్గొన్నారు.



యూపీ మాజీ సీఎం ములాయంసింగ్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జగదీష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మధుయాదవ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, కృష్ణాయాదవ్

ములాయంసింగ్‌కు ఘన నివాళి

పంజాగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదవులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉండాలని సమాజ్‌వాది పార్టీ(ఎస్పీ) వ్యవస్థాపకుడు, యూపీ మాజీ సీఎం, దివంగత నేత ములాయం సింగ్ యాదవ్ కలలు కన్నారు. దానిలో భాగంగానే పార్టీని స్థాపించి ఎంతోమందికి రాజకీయ అవకాశాలు కల్పించారని పలువురు వక్తలు అన్నారు. సోషలిస్టు థింకర్స్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దివంగత సీఎం ములాయం సింగ్ యాదవ్ 85వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎస్పీ జాతీయ కార్యదర్శి, తెలుగు రాష్ట్రాల ఇన్ ఛార్జ్ జగదీష్ యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాస్ యాదవ్, మధు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోశామహల్‌లో బద్రీ విశాల్ పిత్తి నేతృత్వంలో యాదవులు, బీసీలకు అండగా ఒక పార్టీ ఉండాలని ములాయంసింగ్ ఆలోచించారని, యూపీకి వెళ్లిన తర్వాత సమాజ్ వాది పార్టీని ప్రారభించారని వక్తలు అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎంబీ కృష్ణ యాదవ్, సంతోష్ యాదవ్, దయానంద్ యాదవ్, సాయి, లోకేష్, శిరీష, గణేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో..



ములాయం సింగ్ యాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

బంజారాహిల్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ 85వ జయంతి వేడుకలను సమాజ్‌వాదీ పార్టీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 36లోని పార్టీ కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ సమాజ్‌వాదీ పార్టీ నేత దండుబోయిన నిత్య కల్యాణ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, నీలోఫర్, నిమ్స్, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోరా సమితి అధ్యక్షులు మదిరె నర్సింగ్‌రావు మాదిగ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు పూర్తి సమాచారం ఇవ్వండి



సర్వే ఫారం రాస్తున్న డిప్యూటి కమీషనర్ జకియా సుల్తానా, పరిశీలిస్తున్న కార్పొరేటర్ బాబా

బోరబండ, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ ఇంటింటి కుల గణన సర్వే సిబ్బందికి పూర్తి సమాచారం ఇంటి యజమాన్యులు ఇవ్వాలని సర్కిల్-19 డిప్యూటి కమీషనర్ జకియా సుల్తానా అన్నారు. శుక్రవారం బోరబండలో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో కలసి ఆమె పలు బస్తీల్లో పర్యటించి సర్వే సిబ్బంది పూర్తి చేస్తున్న సర్వే ఫారంను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతు అర్హులైన ప్రజలకు ఆరు గ్యారింటీలను అందించడానికి సర్వే ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, డెల్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై శిక్షణ అందించడంతోపాటు, ఫిలింనగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి):



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పంజాగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ బి-బ్లాక్‌లో కార్తీక శుక్రవారం పురస్కరించుకుని నవయువ నాగ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను నూతన పట్టువస్త్రాలు, నగలతో అలంకరించారు. శ్రీవిద్యా వాస్తు జ్యోతిష్యాలయం పండితుడు విద్యాధర శర్మ పర్యవేక్షణలో వేద పండితులు కల్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, వ్యాపారవేత్త దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, నిర్వాహకులు శ్రీకాంత్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, దర్మారెడ్డి, విజయా రెడ్డి, వంశీకిరణ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364

రోడ్ల విస్తరణను 100 అడుగులకు కుదించాలి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థలాలు కోల్పోతున్న బాధితులు

సికింద్రాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి, నాగపూర్ హైవేలపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎలివేటెడ్ క్యారిడార్ల నిర్మాణం నేపథ్యంలో స్థలాలు కోల్పోనున్న ప్రజల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం ముందు నుంచి చెబుతున్నట్టుగా 200అడుగుల మేర రోడ్ల విస్తరణ అవసరం లేదని, కుదించాలని స్థానికులు కోరుతున్నారు. రాజీవ్ రహదారిలో రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోతున్న బాధితులు, వారి తరఫున పోరాడుతున్న రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్ల ఐక్యకార్యాచరణ సమితి కార్ఖానాలోని కౌసల్య ఎస్టేట్‌లో శుక్రవారం సమావేశమైంది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆహ్వానించి, తమ సమస్యలు మొరపెట్టుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, రోడ్ల విస్తరణను కొంత మేరకు కుదించాలని కోరారు. జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా మాట్లాడుతూ ఎలివేటెడ్ క్యారిడార్ల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే విస్తరణను 100 అడుగులకు కుదించడం వలన కొంతైనా తమకు ఊరట లభిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుమరవెల్లి వెంకన్న, ప్రవీణ్, రామ్‌సుధీర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గేట్లను తెరవండి: ఎమ్మెల్యే

కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ నంజుదేశ్వరను కలిశారు. బోయినపల్లి పెన్షన్‌లైన్‌లోని ఫైజన్ స్కూల్ గేటు, 108 బజార్‌లోని గేట్‌లను తెరిచి సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: శ్రీగణేష్

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా రాణించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. శుక్రవారం పికెట్ మైదానంలో ఆశావర్కర్స్, రిసోర్స్ పర్సన్స్‌తో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. కులగణన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికి వెళుతున్న సిబ్బంది సర్వేచేసే సమయంలో ఇంటి యాజమానులతో మర్యాదపూర్వకంగా వివరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

పైపులైన్ పనులను నాణ్యతతో చేపట్టాలి



సివరేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పైపులైను పనులను నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్ సామల హేమ సూచించారు. సీతాఫల్‌మండి డివిజన్, చిలకలగూడ కిందిబస్తీలో దాదాపు రూ. 1.70 లక్షలో చేపడుతున్న సివరేజీ పైపులైన్ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ హేమ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సాయంత్రం సీతాఫల్‌మండి, మోహన్‌రెడ్డినగర్‌లో జరుగుతున్న స్ట్రామ్ వాటర్‌లైన్ పనులను, సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ హేమ పరిశీలించారు. ఆయా కార్యక్రమాలలో జలమండలి మేనేజర్లు కుషాల్, నవ్య, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, హర్టికల్చర్ సూపర్‌వైజర్ సురేష్, నాయకులు సాయి యాదవ్, మస్తాన్, వెంకట్, లక్ష్మీ, లలిత తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలూ భాగస్వాములు కావాలి



పార్కులో చెత్తను ఎత్తివేసి ముగ్గువేసిన శానిటేషన్ సిబ్బంది

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలూ భాగస్వాములు కావాలని శానిటేషన్ సూపర్‌వైజర్ దానగౌడ్ పిలుపునిచ్చారు. మోండా డివిజన్, నెహ్రూనగర్ పార్కులో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 కార్యక్రమం నిర్వహించారు. పార్కులో చెత్తను ఎత్తివేసి ముగ్గువేశారు. ఎండిన ఆకులు, కుళ్లిపోయిన వ్యర్థాలను పడవేయకుండా ఒక గుంత తవ్వి అందులో వేసి మట్టితో కప్పి పెడితే సేంద్రియ ఎరువు తయారవుతుందన్నారు. ఆ సేంద్రియ ఎరువును ఇళ్లలోని పూల మొక్కలు వేసుకోవాలని దానగౌడ్ సూచించారు. దాంతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటూ, మొక్కలకు ఎరువులు కూడా కొనుగోలు చేయాల్సిన అవసరముండదని అన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ జవాన్లు ఎస్.కే.జాంగిర్, ప్రభాకర్, నర్సింగరావు, కృష్ణ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువతను

భాగస్వామం చేయాలన్నదే ప్రధాని ఉద్దేశం



మాట్లాడుతున్న ఎన్‌వైకేఎస్ డైరెక్టర్ విజయారావు, పక్కన ఎస్‌ఐఏ అసిస్టెంట్ డైరెక్టర్ నిషా తదితరులు

పద్మారావునగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయాలన్నదే ప్రధాని మోదీ ప్రధాన ఉద్దేశమని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్) రాష్ట్ర సంచాలకులు ఏఆర్ విజయా రావు పేర్కొన్నారు. శుక్రవారం కవాడిగూడలోని పత్రికా సమాచార సంస్థ(పీఐబీ)కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025 జనవరి 11,12 తేదీల్లో జాతీయ యువజనోత్సవాన్ని(నేషనల్ యూత్ ఫెస్టివల్)పురస్కరించుకొని 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీతో 3000 మంది యువత ప్రత్యక్షంగా పాల్గొంటారని తెలిపారు. వికసిత్ భారత్ చాలెంజ్ నాలుగంచెల పోటీలో ముందువరుసలో నిలిచేవారికి ఇందులో పాల్గొనే అవకాశం ఉంటున్నదని అన్నారు. 2024, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 5 వరకు అఖిల భారత డిజిటల్ క్విజ్ పోటీలతో వికసిత్ భారత్ చాలెంజ్ ప్రారంభమవుతుందన్నారు. 15 ఏళ్ల నుంచి 29 ఏళ్లలోపు పాల్గొనవచ్చని, మేరా యువ భారత్ వేదికగా జరిగే ఈ క్విజ్ పోటీలలో భారత్ సాధించిన ప్రముఖ విజయాలపై వారి పరిజ్ఞానాన్ని పరీక్షించడం ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. నేషనల్ యూత్ ఫెస్టివల్‌కు సంబంధించి వివరాలు మైభారత్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. భారత రాజ్యాంగం ఆమోదం పొందిన నవంబర్ 26న సచివాలయం సమీపంలోని డాక్టర్.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఎన్‌వైకేఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సహకారంతో నవంబర్ 25 నుంచి 30 వరకు కో-ఆపరేటీవ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో 6 రోజుల కశ్మీరి యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన అధికారి కుష్బూ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఒలంపియన్, అర్జున అవార్డు గ్రహీత ఎన్ ముకేశ్‌కుమార్, అథ్లెటిక్స్ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎన్ రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగు పరుగు

- కొన్నేళ్లుగా బ్రాహ్మణవాడిలో మురుగు సమస్య
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- రాకపోకలకు స్థానికుల ఇబ్బందులు



రైల్వే గోడ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు



బ్రాహ్మణవాడి రహదారిలో ప్రవహిస్తున్న మురుగునీరు

బేగంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి ప్రాంతంలో కొన్నేళ్లు తీవ్రంగా మురుగు సమస్య నెలకొంది. కుందన్‌బాగ్‌కు చెందిన మురుగునీరు బేగంపేట రైల్వేస్టేషన్ పట్టాల కింద నుంచి బ్రాహ్మణవాడి రహదారిలోకి వస్తుంది. అయితే పట్టాల కింద ప్రహరీ నుంచి వచ్చే మురుగునీరు ప్రధాన రహదారిలో ప్రవహిస్తుంది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యన పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. దాంతో నిత్యం రహదారిలో పెద్ద ఎత్తున మురుగునీరు వరదలా ప్రవహిస్తున్నంది. దిగువన ఉన్న పల్లపు ప్రాంతంలో మురుగునీరు నిలుస్తున్నది. వర్షం కురిసిందంటే మురుగునీరుకు వరదనీరు కూడా తోడవడంతో ఈ దారిలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటిలోనే విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు వెళ్తున్నారని మండిపడుతున్నారు. పదేళ్లుగా మురుగు సమస్యకు పరిష్కారం చూపడంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమైయ్యారని బ్రాహ్మణవాడి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు సెక్షన్ల పరిధిలో సమస్య

కుందన్‌బాగ్ ప్రాంతం సోమాజిగూడ వాటర్ వర్క్స్ పరిధిలోకి వస్తుంది. బ్రాహ్మణవాడి ప్రాంతం ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ పరిధిలో వస్తుంది. అంటే ఒక సోమాజిగూడ ప్రాంతానికి చెందిన వాటర్‌వర్క్స్ పరిధిలోని కుందన్‌బాగ్ నుంచి ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ పరిధిలోని బ్రాహ్మణవాడికి మురుగునీరు వస్తుంది. పలుమార్లు వాటర్‌వర్క్స్, స్థానిక అధికారులు వచ్చి సమస్యను చూస్తున్నారే తప్ప పరిష్కారం చేయడంలేదు. నెల రోజుల క్రితం వాటర్‌వర్క్స్ జీ.ఎం వినోద్ కార్పొరేటర్ మహేశ్వరి ఈ ప్రాంతంలో పర్యటించారు. కుందన్‌బాగ్ మురుగునీరు రైల్వే పట్టాల కిందగా ఎలా వస్తుందో అర్థం కావడం లేదని ఈ సదర్భంగా పేర్కొన్నారు. రెండు సెక్షన్ల అధికారులు కలిసి సమస్యపై అధ్యయనం చేయవలసిన అవసరం ఉందని అప్పట్లో తెలిపారు. ఇలా గత పది సంవత్సరాలుగా పలువురు అధికారులు వచ్చి చూచి వెళుతున్నారే కాని మురుగు సమస్యను మాత్రం పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

త్వరలో సమస్యకు పరిష్కారం

కుందన్‌బాక్‌కు చెందిన మురుగునీరు రైల్వేలైను పట్టాల కింద ఉన్న జీహెచ్‌ఎంసి వర్షపునీటి నాలాలోకి వెళుతున్నాయి. అక్కడ నుంచి పట్టాల కిందుగా ప్రహరీ దాటి బ్రాహ్మణవాడిలోకి మురుగునీరు చేరుతుంది. శుక్రవారం డివిజన్-6కు చెందిన డీ.జీ.ఎం వంశీతో కలిసి రెండు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు సమస్య తెలిసింది. దీంతో కుందన్‌బాగ్ నుంచి వచ్చే మురుగునీరు పట్టాల కింద ఉన్న జీహెచ్‌ఎంసీ నాలాలో కలవడం వల్లనే... అది నిండి ఇటు వైపునకు వస్తున్నాయని అంచనాకు వచ్చాం. కుందన్‌బాగ్ నుంచి వచ్చే మురుగునీరు పట్టాల కింద ఉన్న జీహెచ్‌ఎంసీ నాలాలో కలవకుండా డైవర్ట్ చేయడం వల్ల సమస్య పరిష్కారం అవుతుందని ఇద్దరం భావించాం. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఒక వేళ డైవర్ట్ చేసినా మురుగునీరు ఇటు వైపు వస్తే ఏమి చేయాలనే విషయంపై అధ్యయనం చేస్తున్నాం. త్వరలో మురుగు సమస్యకు పరిష్కారం చూపిస్తాం

- ఆశీష్, వాటర్‌వర్క్స్ డీజీఎం

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ డీసీపీ రేష్మీ పెరుమాళ్

అడ్డగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. శుక్రవారం పార్కడైజ్ సమీపంలోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాలులో సికింద్రాబాద్‌లోని వివిధ వ్యాపారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. మాదక ద్రవ్యాలు గంజాయి సరఫరా, చోరీలు ఇతరత్ర నేరాలు జరుగకుండా పోలీసులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్‌లోని ప్రతీ వ్యాపారీ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సికింద్రాబాద్‌లోని పాట్‌మార్కెట్ ఏరియాలోని బంగారు దుకాణాల వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. కొంతమంది కొనుగోలుదారుల రూపంలో దుకాణాలకు వచ్చి నగలు ఎత్తుకెళ్లే అవకాశమున్నదని అన్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు తమ సమస్యలను డీసీపీ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. జనరల్‌బజారులో ట్రాఫిక్ తీవ్ర సమస్య ఉందని ట్రాఫిక్ పోలీసులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ అశోక్, కార్ఖానా సీఐ వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, మహాకాళీ ఏసీపీ సర్దార్‌సింగ్, రాంగోపాల్‌పేట్, మహాకాళీ సీఐలు నర్సింగ్‌రావు, పరుశరాం, సికింద్రాబాద్‌లోని వివిధ దుకాణాల యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కులగణన పత్రాలు రోడ్డుపాలు..

- జవహర్‌నగర్ సర్వే పత్రాలు తార్నాక లభ్యం



జవహర్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో నిర్వహించిన కులగణన సర్వే పత్రాలు తార్నాక రోడ్డుపై చెల్లచెదురుగా పడి ఉన్నాయి. ఈ దృశ్యాలు శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేపత్రాలు కొద్ది రోజుల క్రితమే మేడ్చల్ హైవే పక్కన దర్శనమిచ్చాయి. ఈ ఘటన మరవక ముందే జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వేపత్రాలు తార్నాకాలో రోడ్డుపై కనిపించడంతో ఎంతో జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన పత్రాలు రోడ్డుపై పడిఉండటాన్ని చూసిన ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

స్పందించని మున్సిపల్ కమిషనర్

జవహర్‌నగర్ కార్పొరేషన్ కులగణన సర్వే పత్రాలు తార్నాక రోడ్డుపై పడి ఉన్న విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరేందుకు ఫోన్‌లో పలుమార్లు సంప్రదించినా కమిషనర్ స్పందించలేదు.

వైద్య విద్యార్థులు ర్యాగింగ్ దూరంగా ఉండాలి

గాంధీ మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్

బౌద్ధనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ర్యాగింగ్ దూరంగా ఉండాలని ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి సూచించారు. శుక్రవారం గాంధీ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో 'యాంటీ ర్యాగింగ్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ బాలస్వామి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జస్టిస్ అరుణకుమారి, గాంధీమెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా, సూపరింటెండెంట్ రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర రావు, వాల్యా ఫోరెనిక్స్ ప్రొఫెసర్ కృపాల్‌సింగ్, బాయ్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ వినోద్, అనస్తిసియా అసిస్టెంట్ ప్రొఫెసర్ సంగీత, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

300 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

బోయిన్‌పల్లి, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని బోయినపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 300 గ్రాముల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నారాపల్లికి చెందిన ముదస్సర్(22), అఫ్రిది(22) ఎండు గంజాయిని విక్రయిస్తూ అక్రమ సంపాదనకు అలవాటుపడ్డారు. వారికి బోయినపల్లికి చెందిన టింకిల్‌ఖాన్(23), ఇజాజ్(21)తో పరిచయం ఏర్పడింది. వారందరు ముఠాగా ఏర్పడి బోయినపల్లి శివారు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి బోయినపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ముదస్సర్, టింకిల్‌ఖాన్, ఇజాజ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా 300 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఏడాది పొడవునా అన్నదానం

- అనాథల ఆకలి తీరుస్తున్న గురుద్వారా ప్రబంధక్ కమిటీ



లంగర్ సేవలో భోజనం అందజేస్తున్న ప్రబంధక్ కమిటీ సభ్యులు

రెజిమెంటల్‌బజార్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిక్కులు లంగర్ సేవ (అన్నదానం)కు ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి గురుద్వారాలో లంగర్ సేవలు నిర్వహిస్తూ కులమతాలకతీతంగా ఆకలితో వచ్చిన వారికి ఉచితంగా భోజనం అందిస్తారు. తెలంగాణలో ఉన్న 52 గురుద్వారాలలో ఈ లంగర్ సేవ కొనసాగుతుంది. 550 ఏళ్ల క్రితం సిక్కుల గురువు గురునానక్ రూ.20లతో లంగర్‌సేవ ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతీ గురుద్వారాలో లంగర్‌సేవ నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. గురుద్వారాలో ఎత్తైన ప్రదేశంలో అందరికీ కనపడేలా జెండా(నిషాన్ సాహిబ్) కనిపిస్తుంది. ఈ నిషాన్‌సాహిబ్ సహాయం చేయడానికి గురుద్వారా ఉంది అనే సంకేతం. సికింద్రాబాద్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా పేదలు, అనాథలకు అన్నదానం చేస్తూ ఆకలి తీరుస్తున్నారు.

రోజూ 200 నుంచి 250 మందికి..

సికింద్రాబాద్ గురుద్వారాలో రోజూ 200-250 మందికి అన్నదానం చేస్తున్నారు. దీనితోపాటు ఉదయం అల్పాహారం, సాయంత్రం పలావ్ అందిస్తూ పేదల ఆకలి తీరుస్తున్నారు. కేవలం అనాథలే కాకుండా ఇతరులు కూడా వచ్చి భోజనం చేసి ఆకలి తీర్చుకుంటున్నారు. గురుద్వారాకు వస్తే అకలి తీర్చుకోవచ్చని లంగర్ సేవ సమయానికి అనాథలు అక్కడి చేరుకుని లైన్‌లో నిల్చుంటారు.

సామాజిక సేవకు ప్రాధాన్యం



సామాజిక సేవకు గురుద్వారా ప్రబంధక్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుంది. పేదలకు మూడు పూటలా ఆకలి తీరుస్తున్నాం. కోవిడ్ సమయంలో నిత్యావసరాలను పంపిణీ చేశాం. కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ సిలిండర్‌లు ఉచితంగా అందించాం.

- హరిప్రీత్ సింగ్ గులాటీ, సెక్రటరీ, గురుద్వారా సాహెబ్

తల్లిని కొడుతుండగా మధ్యలో వచ్చాడని పెదనాన్నపై దాడి

అడ్డగుట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిని కొడుతున్న ఇద్దరు కుమారులను మందలించేందుకు వచ్చిన 'పెదనాన్నపై మా మధ్యలో ఎందుకు వస్తావంటూ' బ్లేడుతో గాయపరిచిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట ఆర్ఆర్‌సీ మైదానం సమీప ప్రాంతంలో ఉంటున్న బుచ్చమ్మను, ఆమె కుమారులు మల్లికార్జున్, రాకేష్ గురువారం రాత్రి కొట్టడంతో పక్కనే ఉన్న పెద్దనాన్న శ్రీనివాస్ గమనించాడు. 'అమ్మను ఎందుకు కొడుతున్నార్రా' అంటుండగా మధ్యలో ఎందుకు వస్తావంటూ మల్లికార్జున్ ఇంట్లో ఉన్న బ్లేడ్‌తో దాడిచేసి కడుపు భాగం, ఎడమ చేతిపై కోశాడు. శ్రీనివాస్ స్పృహకోల్పోగా స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని శ్రీనివాస్ కుటుంబసభ్యులు మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. దాడికి పాల్పడ్డ మల్లికార్జున్‌తోపాటు అతడి తల్లి కుమారుడు రాకేష్‌లపై తుకారాంగేట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి: బాధితులు

అఫ్జల్‌గంజ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచింగ్ పేరుతో నమ్మించి మోసం చేసిన ఆర్‌జే సంస్థపై చర్యలు తీసుకుని తమ డబ్బులు ఇప్పించాలని బాధితులు సీసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌జే వెంచర్స్ నిర్వాహకులు ప్రముఖులతో ప్రకటనలు ఇప్పించడంతో నారాయణ్‌ఖేడ్, ఘట్‌కేసర్, పఠాన్‌చెరు తదితర ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు, ఫామ్‌ల్యాండ్‌లను కొన్నామని తెలిపారు. సుమారు 600 మంది నుంచి రూ.150 కోట్లను నిర్వాహకులు వసూలు చేశారని ఆరోపించారు. 2020లో ఒక్కొక్కరం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కట్టామని, ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టలేదని ఆరోపించారు. వెంచర్ ఎండీ భాస్కర్‌గుప్తా, డైరెక్టర్ సుధారాణిలను ఎన్ని సార్లు అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. గట్టిగా అడిగితే చెక్కులు ఇచ్చారని, అవి బౌన్స్ అయ్యాయని తెలిపారు. ఈ విషయమై సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆర్‌జే సంస్థ ఆస్తులు అమ్మి తమకు న్యాయం చేయాలని కోరారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలి

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆర్థికస్థోమతలేని పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ వరమని ఆయన అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాంగోపాల్‌పేట డివిజన్‌కు చెందిన ఏడుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన దాదాపు రూ. 2.25 లక్షల చెక్కులను లబ్ధిదారులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు మహా కాలబైరవ జయంత్యుత్సవాలు

మారేడుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పికెట్‌లోని పంచభూత భూమేశ్వరస్వామి శివపంచాయతన ఆలయంలో ఈ నెల 23న మహాకాలభైరవ (అష్టమి) జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి జెట్టి ఉమేష్‌శ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కాలభైరవ ఉత్సవ విగ్రహానికి శనివారం సాయంత్రం 4గంటలకు గురుపూజ, మహాకాలభైరవ హోమం, పంచామృత అభిషేకం, పంచభూత ఆరాధన, మహాకాలభైరవ దీపం, ఆకాశదీపం, నక్షత్రదీపం, సప్త ఋషి హారతి, వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బోయిన్‌పల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తులు, చెట్టకొమ్మల తొలగింపు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఇన్‌చార్జి డీఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు రాంరాజ్‌నగర్, ఎండీఎఫ్ రోడ్, శంకర్ ఎన్‌క్లేవ్, సమతానగర్, ఫిరోజ్‌గూడ, కోయబస్తీ ప్రాంతాల్లో.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దిల్‌ఖుష్‌నగర్, మానస సరోవర్, ఫేజ్-1, 2, 3, ఎల్‌బీనగర్, గంగపుత్ర సంఘం, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

తాడ్‌బంద్ వీరాంజనేయస్వామి ఆలయంలో

రేపు మహా అన్నకూట మహోత్సవం

బోయిన్‌పల్లి, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి తాడ్‌బంద్ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 23న మహా అన్నకూట మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు అలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగా సుందరంగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున అభిషేక పూజలతో మహా అన్నకూట మహోత్సవ వేడుకలను ప్రారంభం కానున్నాయి. 11 గంటలకు పూజలు. మధ్యాహ్నం ఒంటిగంటకు దివ్యజ్యోతి దర్శనం.. అనంతరం మహావైభవోపేతంగా మహాఅన్నకూట మహోత్సవ కార్యక్రమాన్ని మంగళ వాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్చరణలో నిర్వహించనున్నారు. అన్నకూట పండుగను కొత్త ఆరంభంగా జరుపుకుంటారు. అన్నకూట యొక్క సాహిత్యపరమైన అర్థం ఆహార పర్వతం. ఇది దేవునికి ఆహార నైవేద్యాన్ని, దానిని తయారు చేయడంలో ఉన్న ప్రేమ, భక్తిని సూచిస్తుంది. భక్తులు భక్తితో తయారు చేసిన అనేక రకాల ఆహార పదార్థాలను భగవంతుడికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు మహాలక్ష్మి పంచకుండియ మహాయజ్ఞం నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అయల ఈవో నరేందర్ వెల్లడించారు. భక్తులకు స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

తిరుమలగిరి నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్, జనహిత సేవా ట్రస్టు, ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బొల్లారంలోని బొల్లారంలోని త్రిశూల్ పార్క్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన అధ్యక్షురాలు మంజూగుప్తా, కమ్యూనిటీ సర్వీస్ డైరెక్టర్ రామచంద్ర, జనహిత సేవా డైరెక్టర్ రామచంద్ర తదితరులు ప్రారంభించారు. హబ్సిగుడలోని ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్ వైద్యులు 215 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు రక్తంలో హీమోగ్లోబిన్ శాతం పరీక్షించి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో బొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి విజయసారథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లేఖా భవన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

8వ వేతన సంఘం ఏర్పాటుకు కృషి

చిలకలగూడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మజ్దూర్ యూనియన్ కృషి చేస్తున్నదని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచ్ కార్యదర్శి చింతకుంట రామకృష్ణ అన్నారు. డిసెంబర్ 4,5,6, తేదీల్లో జరిగే కార్మిక సంఘం ఎన్నికలో మజ్దూర్ యూనియన్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని లేఖాభవన్, ప్రింటింగ్ ప్రెస్ కార్యాలయాల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతు 8వ వేతన సంఘం ఏర్పాటు, ఖాళీ ఉద్యోగాల భర్తీ, పాత పెన్షన్ అమలు తదితర అంశాలతో పాటు రైల్వే కార్మికులు, ఉద్యోగులు సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు సంజీవయ్య, యూనస్ అహ్మద్, పద్మజ, ఎం.కె.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
ఎం.డి. రఫీక్ : 99854 00084, జి.అంజయ్య: 9985921364